క్లుప్తంగా

అక్షింతలు పంపిణీ



యాజలి(కర్లపాలెం): అయోధ్యలో సోమవారం శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ జరగనున్నందున అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు ఆదివారం యాజలి గ్రామంలో శ్రీ ఆత్మారామ భజన సమాజం, గ్రామపెద్దలు కోదండ రామస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో శోభా యాత్ర చేస్తూ అక్షింతలు, జెండాలు ప్రజలకు అందజేశారు.22న గ్రామంలోని కోదండ రామ స్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని యావన్మంది భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పి.ఏడుకొండలు ఆదివారం తెలిపారు. మండలంలోని వేమవరం దగ్గర నుంచి రాచూరు, పల్లెకోన, ఆళ్లమూడి వరకు ఉన్న గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

వేమూరు: వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కార్యకర్తల సమావేశం మార్కెట్ యార్డులో సోమవారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పాండురంగ స్వామికి అభిషేకాలు



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి వారికి బ్రాహ్మీ ముహూర్తాన ఆదివారం పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఏకాదశిని పురస్కరించుకుని దేవస్థానంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు అర్చకులు ధారా నారాయణమూర్తి తెలిపారు.

శోభాయమానంగా రామాలయాలు

భట్టిప్రోలు: అయోధ్యలో సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని రామాలయాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో శ్రీరామునికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 22న ప్రతి ఇంట్లో, దేవాలయాల్లో ఐదు దీపాలకు తగ్గకుండా దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేశారు.

అగ్ని ప్రమాదంలో ఐదు పూరిళ్లు దగ్ధం

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదంలో ఐదు పూరిళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పూడి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఉప్పూడి కాల్వకట్టపై పోట్లూరి ఆచార్యులు గృహానికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మంటలు ఎగసిపడటంతో పక్కనే ఉన్న మెరికా పుల్లమ్మ, నాగమణి, దుర్గ, వెంకట్రావులకు చెందిన పూరిళ్లకు నిప్పు అంటుకుని అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించటంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.1.90లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా.

తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మృతి



రేపల్లెరూరల్: రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పట్టణంలోని 20వ వార్డుకు చెందిన దుర్గాప్రసాద్(55) శనివారం గుండెపోటుతో తిరుపతిలో కన్నుమూశారు. కుటుంబ సభ్యులతో కలిసి దుర్గాప్రసాద్ తిరుపతిలో శ్రీవారి దర్శనానికై వెళ్లి విశ్రాంతి గదిలో నిద్రిస్తుండగా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న టీటీడీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా దుర్గాప్రసాద్ భౌతిక కాయాన్ని ఆదివారం రేపల్లెలోని ఆయన స్వగృహానికి తరలించారు.

సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేద్దాం

- వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి
- 28న వేమూరులో బస్సుయాత్ర ప్రారంభం



మృతురాలి కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న అశోక్‌బాబు

భట్టిప్రోలు: ఈ నెల 28న వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన బస్సు యాత్ర నిర్వహణకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరిశీలించి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ బస్సు యాత్రను దిగ్విజయం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి కట్టుగా కృషి చేయాలని కోరారు. పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన కనుకుర్తి విజయకుమారి ఇటీవల మృతి చెందడంతో బీమా నగదు రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. వేల్పూరి సాంబశివరావు అనే వ్యక్తి మృతి చెందడంతో రూ.10 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం అందించారు. పార్టీ సీనియర్ నాయకులు తలకొల యలమంద భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించారు. అద్దేపల్లి చీరలకు ప్రసిద్ధి గాంచిన చేనేత వస్త్రాలను పరిశీలించి కొనుగోలు చేశారు. అద్దేపల్లి ముఖ్య కూడలి వద్ద స్థానికులతో టీ తాగుతూ సలుగురితో కలివిడిగా మాట్లాడి వారి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుందేటి రమేష్, పీజీ అరుణ్‌శాస్త్రి, మోర్ల కోటేశ్వరరావు, పెరికల శ్యామ్, వేల్పూరి చిన్నారి, దావూరి నాగమల్లేశ్వరరావు, దారా చెన్నయ్య, తిరువీధుల బాలాజీ, సయ్యద్ నబీ, పాలాటి హనుమంతరావు, దాసరి ఫణీంద్ర, కె.భాస్కర్ తదితరులు ఉన్నారు.

పల్లెకోనలో 23న సోషల్ మీడియా సమావేశం



సోషల్ మీడియా యూత్‌తో మాట్లాడుతున్న అశోక్‌బాబు

పల్లెకోన(భట్టిప్రోలు): మండలంలోని పల్లెకోనలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న సోషల్ మీడియా సమావేశానికి సంబంధించి స్థలాన్ని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చిన బుజ్జి, సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, పెద్దిశెట్టి రాంబాబు, జయవరపు రాధాకృష్ణమూర్తి, అగ్నికుల క్షత్రియ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చిలక రత్నబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెబ్బా మున్ని, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, పంతగాని బాలసుబ్రహ్మణ్యం, జస్వంత్‌రాజ్, అన్వేష్, చిలక జాషువా, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ విద్యాసాగర్



తాగునీటి పైపు లైన్లను పరిశీలిస్తున్న విద్యాసాగర్

రేపల్లె రూరల్: తీర ప్రాంతాలలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ సీఎస్ విద్యాసాగర్ చెప్పారు. మండలంలోని తుమ్మలలో రూ.8.71 కోట్లతో నిర్మాణంలో ఉన్న తాగునీటి పథకం పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తుమ్మల తాగునీటి పథకం పూర్తయి వినియోగంలోకి వస్తే తుమ్మలతో పాటు నిర్మల్‌నగర్, గాదెవారిపాలెం, మోళ్లగుంట, కట్టవ, లంకెవానిదిబ్బ వరకు 30 గ్రామాలకు పైగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాలలోని తాగునీటి చెరువులను నింపుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. గంగడిపాలెం పంచాయతీ మృత్యుంజయపాలెం తాగునీటి చెరువులో సరిపడ నిల్వలు చేశామన్నారు. రాజుకాల్వ పరిధిలోని గ్రామాలలోని పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజుకాల్వ సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ నడకతో ఆయుఃప్రమాణం పెరుగుతుంది

- ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎంవీ ప్రసాద్
- వాకర్స్ క్లబ్ 24వ వార్షికోత్సవం
- క్లబ్ సభ్యుడు అచ్చయ్య రూ.50 వేల విరాళం



ఉత్తమ వాకర్స్ అవార్డు గ్రహీతలతో క్లబ్ బాధ్యులు

తెనాలి: పట్టణంలోని వాకర్స్ క్లబ్ 24వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెనాలి రీజనల్ మేనేజర్ నోరి ఎల్ కేఎంవీ ప్రసాద్ 'నడకతో ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ఎలా?' అనే అంశంపై ప్రసంగించారు. ఆహార నియమాలు పాటిస్తూ ప్రతిరోజూ నడవటం వల్ల గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయని, ఆయుః ప్రమాణం పెరుగుతుందని చెప్పారు. ప్రతి విషయానికి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు మందులపై ఆధారపడకుండా చూసుకోవాలని చెప్పారు. ఉత్తమ వాకర్స్‌గా వేములపల్లి వెంకట్రామయ్య, మెయ్య శ్రీలక్ష్మి, నాగం వెంకటేశ్వరరావును సత్కరించారు. సీనియర్ వాకర్లు జీపీపీ చంద్రశేఖరరావు, ప్రభల సూర్యనారాయణమూర్తి, రాపర్ల వెంకటనర్సయ్య, బీఎస్‌ఎన్‌హెచ్‌పీ ప్రసాదరావుకు చిరు సత్కారం చేశారు. క్లబ్ సభ్యుడు దొడ్డపనేని అచ్చయ్య వాకర్స్ క్లబ్‌కు రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో ఎన్నారై లక్ష్మీరూపలత, ఎస్‌బీఐ కొత్తపేట ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్, బోసురోడ్డు బ్రాంచి మేనేజరు వి.చలపతిరావు, టి.రత్తయ్య, మువ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐలవరంలో మార్మోగిన రామ నామస్మరణ

24 గంటల పాటు నిర్విఘ్నంగా నామసంకీర్తనలు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఐలవరం(భట్టిప్రోలు): అయోధ్య రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఏకాహంలో భాగంగా భజన సంకీర్తనలు నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు నిర్విఘ్నంగా భజన సంకీర్తన పారాయణం జరిగింది. గ్రామంలోని రామాలయం నుంచి శ్రీరామ్ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా రాములవారి రథోత్సవం నిర్వహించారు. మాచర్లవారి చెరువు వైపు రామ మందిరంలో అయోధ్య రాముల వారి అక్షింతలతో శోభాయాత్ర, స్వర్ణ సంయోగ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు జొన్నాదుల ఉమ, మాచర్ల రంగారావు, పులిమి నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల అర్బన్: వైద్య రంగంలో విస్తృత సేవలు అందించే విధంగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేయటంతో వాటికి సంబంధించిన ప్రైవేటు అనుబంధ సంస్థలు రావటం హర్షణీయమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు.బాపట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన మైక్రో ల్యాబ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. చీరాల పట్టణంలోని మైక్రో ల్యాబ్ బాపట్లలో కూడా ప్రారంభించటం సంతోషంగా ఉందని, ల్యాబ్ ఎండీ కటికల భాగ్యరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు ఎస్.కొండలరావు, పి.సందీప్, పి.శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కొలిక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా బాబావారి వార్షికోత్సవం



పెదలంక(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాబావారి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస్ విద్యార్థులకు ఆటలు, భజన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాలను నిర్వాహకులు వేములపల్లి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

గోడపత్రికల ఆవిష్కరణ

భట్టిప్రోలు: రిపబ్లిక్‌డేను హక్కుల పండుగ దినోత్సవంగా జరుపుకుందాం అనే నినాదంతో ఛలో భట్టిప్రోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ బహుజన ఐక్యవేదిక కన్వీనర్ జడా రవీంద్ర బాబు తెలిపారు. హక్కుల పరిరక్షణ పోరాట యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ సాధకుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందర బాబుకు ఆ రోజు ఘనంగా పౌర సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం దళిత, గిరిజన, బహుజన నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యానాది మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కూరేటి మాణిక్యారావు, బీసీ నాయకులు కత్తి శ్రీను, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు కనపర్తి కోటేష్, కొనకాల ప్రసాద్, పేర్ల మోసే, తెనాలి నారాయణ, నాని తదితరులు పాల్గొన్నారు.

మాజీ చైర్మన్ సుబ్బయ్య సేవలు మరువలేనివి



సుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ అఖిలేష్, డాక్టర్ అవినాష్ తదితరులు

తెనాలిఅర్బన్: తెనాలి మార్కెట్ యార్డు అభివృద్ధికి గడవర్తి సుబ్బయ్య చేసిన కృషి మరువరానిదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య సంతాప సభను రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ బీసీ సంఘ నాయకునిగా ఆయన అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలచి పోయారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ తాడిబోయిన అవినాష్, ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, యార్డు వైస్ చైర్మన్ వంపుగళ్ళ కృష్ణ, కుర్రా శ్రీను, కాటుపల్లి శ్రీను, అంబరీషుడు, విష్ణువర్ధన్, నల్లగొర్ల నాగేశ్వరరావు, కరేటి రవి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రఘుపతి

బాపట్ల: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు.బాపట్ల మండలంలోని మూలపాలెం గ్రామంలో వృద్ధులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ ప్రతి ఏడాది వృద్ధులకు కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్లపాలెం: నవరత్నాలతో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలిచి మళ్లీ ఆయనను సీఎంను చేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. ఆదివారం రాత్రి పెదపులుగువారిపాలెంలో కోన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పింఛను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోన రఘుపతి దుప్పట్లు పంపిణీ చేశారు. నర్రావారిపాలెం గ్రామంలో జరిగిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో సినీ రచయిత కోన వెంకట్ పాల్గొని పింఛను లబ్ధిదారులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కోన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సినీ రచయిత కోన వెంకట్ మాట్లాడుతూ గ్రామంలోని ఆర్వో ప్లాంటు మరమ్మత్తులకు రూ.5 లక్షలు సొంత నగదు ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, పార్టీ నాయకులు మందపాటి పరమానంద కుమార్, పివి.సురేష్, ఆసిఫ్ అలీ, ఆట్ల నాగేశ్వరరెడ్డి, కాసాని వరప్రసాద్, జాకీర్ హుస్సేన్, బెనర్జి, అమీర్‌బేగ్, కంకిపాటి నాగరాజు, బాబూరావు, నాగరాజురెడ్డి, రమేష్, తదితరులు ఉన్నారు.

రచయితల పురిటి గడ్డ భావపురి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘుపతి

బాపట్ల: రచయితల పురిటిగడ్డగా భావపురి పేరొందిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల రచయితల సంఘం పునః ప్రారంభం సందర్భంగా పోస్టర్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ 1968వ సంవత్సరంలో ఆనాటి ఇన్‌కంటాక్స్ అధికారి ఏ.గోపాలరావు, న్యాయవాది కోటంరాజు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సంఘం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బ్రెయిలీ లిపి దివ్యాంగుల పాలిట వరం



మాట్లాడుతున్న రవీంద్రబాబు

బాపట్ల: అంధులకు బ్రెయిలీ లిపి ఎంతో ఉపయోగకరమని విజువల్లి చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.రవీంద్రబాబు పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ 215 వ జయంతి వేడుకలు బాపట్లలో ఆదివారం జరిగాయి. ఈ వేడుకల్లో అంధులకు ఉపయోగపడే విధంగా లూయిస్ బ్రెయిలీ పొందుపరిచిన లిపి నేర్పించేందుకు హాస్టల్ ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు వీరభద్రరావు, చల్లా రామయ్య, జి.ఆదిశేషు, ఏ.వీ. మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతిరోజూ వ్యాయామం చేయండి

తెనాలిఅర్బన్: నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట పాటు వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పీఏ సునీల్ పేర్కొన్నారు. తెనాలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చినరావూరు పార్కులో ఏరోబిక్స్, జుంబాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్ఎన్ స్టేడియంలో ఉచితంగా ఏరోబిక్స్, జుంబాపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షకులు కె.శ్రీకాంత్, స్టేడియం డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు రాజేంద్రరెడ్డి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సాంబశివరావు, వాకర్స్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే ఆదివారం తెనాలి పట్టణంలో కొనసాగింది. వార్డు వలంటీర్, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వారి కులాల వివరాలు నమోదు చేసి ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయించారు. దీనిని ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

పోలీసుల అదుపులో జూదరులు

పెదకాకాని: పేకాట స్థావరంపై నిర్వహించిన దాడుల్లో ఐదుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొప్పురావూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం ఆదివారం ఐదుగురు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,570ల నగదు, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వినోద్ బాబు తెలిపారు.

గారపాడులో..

ప్రత్తిపాడు: కంది పొలంలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. వట్టిచెరుకూరు మండలం గారపాడులోని కంది పొలాల్లో ఆదివారం రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచి అధికారులకు అందింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వట్టిచెరుకూరు పోలీసులు జూద స్థావరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.21,340లు నగదుతో పాటు ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

పొన్నూరులో..

పొన్నూరు: పట్టణంలోని ఎరుకులవాడ సమీపంలోని పొలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై షేక్. హసీం తెలిపారు. వారి నుంచి రూ.3,800 నగదు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్

పెదకాకాని: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన మేడా సాంబయ్య వద్ద నుంచి 35, నక్కా బాజి వద్ద 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

నేడు ఓటర్ల తుది జాబితా ప్రచురణ

సిద్ధం చేసిన యంత్రాంగం

ప్రత్తిపాడు: తుది ఓటర్ల జాబితా ప్రచురణకు రంగం సిద్ధమయ్యింది. ఈ నెల 22న ఫైనల్ జాబితాను ప్రచురించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ -2024 ప్రకారం ఇప్పటికే పోలింగ్ బూత్ లెవల్లో అనేక సార్లు స్పెషల్ క్యాంపులు నిర్వహించి, నూతన ఓటరుకు దరఖాస్తుతో పాటు మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం గతేడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురించారు. ముసాయిదా జాబితాను పోలింగ్ బూత్‌ల వద్ద, రెవెన్యూ కార్యాలయాల్లో పరిశీలన నిమిత్తం అందుబాటులో ఉంచారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నవంబరు మూడు, నాలుగు తేదీల్లో, డిసెంబరు నాలుగు, ఐదు తేదీల్లో పీఎస్‌ల వద్ద స్పెషల్ క్యాంపెయిన్‌లు చేపట్టి, అభ్యంతరాలు స్వీకరించారు. గత డిసెంబరు 26 వరకు అభ్యంతరాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టారు. అభ్యంతరాల దరఖాస్తులపై నియోజకవర్గ స్థాయిలో పలు దఫాలుగా అన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశాలు జరిపి, మార్పులు, చేర్పులతో పాటు తొలగింపులకు సంబంధించి అర్జీల వివరాలను, విచారణల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆయా పార్టీల నాయకులకు వివరిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశారు. ఈ నేపథ్యంలో నేడు తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లో 2,58,973 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,21,553 మంది పురుషులు, 1,28,662 మంది మహిళలు, 32 మంది ఇతరులు ఉన్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నేడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ ఫైనల్ జాబితాను ప్రచురించనున్నారు. అనంతరం రాజకీయ పార్టీల నేతలకు జాబితాను అందించనున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి పట్టణ మారీసుపేటలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. మొహిద్దీన్ షా అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 24 సీసాలు లభించాయి. దీంతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని మోసం

తెనాలిరూరల్: ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన జమీర్ ఖాన్ కొడుకుకు ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని మంగళగిరికి చెందిన నాగ వెంకట శ్రీనివాస్ కొద్ది నెలల క్రితం కలిశాడు. కళాశాల ఫీజుతో పాటు కొంత ఖర్చు అవుతుందని చెప్పి పలు విడతల్లో రూ.రెండు లక్షలు తన ఖాతాకు ఫోన్‌పే ద్వారా నాగ వెంకట శ్రీనివాస్ వేయించుకున్నాడు. నెలలు గడుస్తున్నా సీటు ఊసే ఎత్తకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి జమీర్ ఖాన్ పోలీసులను ఆశ్రయించాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.